కథానిక:

# ముసిలి మనసు

శ్రీ గౌరావజ్ఝల వెంకటసుబ్బరామయ్య

అసలు నాసంగతి తల్చుకుంటే నాకే ఎట్లానో అనిపిస్తుంది. నా సంగతి వింటే లోకంలో ఇటువంటి వాండ్లుకూడా వుంటారా అని ఆశ్చర్యపడతారు. పోనీ చెప్పకుండా వుందామా అంటే మీకు నాసంగతి,మనోభావాలు, స్థితిగతులు తెలిసేదెట్లా? అందుకనే గుండె రాయిచేసు కొని, మనస్సును చిక్కబట్టుకొని, సిగ్గు విడిచి, చెప్పకుండా వ్రాయబూనుకుంది.

నాకు ముగ్గురుభార్యలు గతించారు. అంటే 3 తద్దినాలు మెడకు కట్టుకున్నా నన్నమాట. ఇక లాభం లేదనకొని, ఈ తద్దినాలబాధ పడలేక 10 యేండ్లకుంకను దత్తుతెచ్చుకున్నా. మా అక్కగారు నా వియోగాన్నిచూచి సహించలేకనో, వంటకు తోడులేమి చేతనో....మరెందుకో ఓ సంబంధం కుదిర్చింది. బలవంతాన వద్దు వద్దంటే మెడలువిరిచి పప్పించింది. పెండ్లి జరిగిపోయింది.

13 ఏండ్ల పిల్ల. ఒడ్డు పొ రు గు, ఛా రీ పి ల్ల నే చెప్పొచ్చు. 5 ఇండ్ల చాకిరీ చేసినా అలు పెరుగదు. పుట్టినప్పటినుంచి జలుబుకూడాచేసి ఎరుగదని వాండ్లమ్మచెప్పింది....(క్షమించండి, నాకన్నచిన్నదగుటచే అత్తగా రనలేక వాండ్ల అమ్మ అని సంబోధిస్తున్నాను)....పెండ్లికాగానే ఇక్కడే వుండిపోయింది. మాయింట్లో అన్నాని కేం లోటు! ఇక్కడి తిండికి పొట్లచెట్టులాగా పెరుగుతున్న ట్లనిపిస్తుంది. బారెడు జడ.చేరెడు,కండ్లు; అందమైన ఉనికి.రూపము, ఐతే నారూపమో ! చెప్పక్కర్లేదనుకుంటా. నోట్లో ఎవిమిదే పండ్లు. కళంకంలేని వెంట్రుకలు. రెప్పలు వాలిన కండ్లు, ముడతలుపడ్డ శరీరం. మొయ్యలేని బొర్ర, నడవలేనివాతం. వాటికితోడుపాడు పొడుమొకటి అలవాటు. నేను కూడా అలవాటుచొప్పున పీలుస్తుంటానే కాని నాకే ఆ వాసన గిట్టకుండాఉండే. ఇటువంటి నన్ను చూస్తూ ఎవరు పెండ్లాడుతారా, అని సందేహించా. పెండ్లిచేసుకో నని పట్టుబట్టా.... ఏదో అపరవయస్సు దాన్నే తెచ్చుకుందామని ఒక మాటు ఆలోచించాకాని, తెచ్చుకుంటే మా బ్రాహ్మణ సంఘం పూరుకుంటుందీ ! వెలివేసి చంపదూ ; అంతెందుకూ, నేనే ఎంతోమందిని వెలివేసి వేధించలేదూ ?....ఏదో ఎవరిప్రాప్తం వాండ్లది. నాకు వ్రాశివుంది జరిగింది.

ఐతే, వచ్చినప్పటినుంచి బహు జాగ్రత్తతో పరిశీలిస్తున్నా. దానిలో రోజుకురోజు ఏదో నూతనత్వం, క్రొత్త అందం, అనిర్వచనీయమైనకాంతి, ముఖంలో తేజస్సు, అంగ అంగంలో సౌష్ఠవం, కండ్లలో మాదకత వస్తున్నట్లుగా తోస్తుంది. వెంటనే గదిలోకి పోయి తలుపులు బిగించి అద్దంలో నన్ను, నాముఖాన్ని చూచుకునేవాణ్ణి. నిన్నటికంటె నాలో ఏదో లోపం, తేజోహీనత, కొరత, నిరుత్సాహం, విస్తేజం ప్రవేశించినట్లుగా తోచేది. వెంటనే ఒక్క నిట్టూర్పువిడిచి అద్దం కింద పడేసేవాణ్ణి. నాలో లేవలేనంత నీరసం ప్రవేశించేది. కొంతసేపటికి లేచి గబగబా దానిదగ్గరికి వెళ్లి నిదానించి దాన్ని చూచి ‘ఇలారా !’ అనే వాణ్ణి. ‘ఎందుకండి!’ అని చేసే పనిమాని దగ్గరి కొచ్చేది. ‘అలా వళ్లు అలిసేట్టు పని చేస్తే జబ్బు చేయదు ! శేమలో తిరగవాక....డాక్టరు చుట్టూ నేను తిరగలేను, ముఖానబొట్టు చెరిగిపోయింది చూడు....వెంట్రుకలు చెదిరివున్నాయి, సవరించుకో అన్నాను. నామాటలలోని అసందర్భాన్ని, నిస్సారతను గ్రహించేదో లేదో కాని పెదలకుండా వెంట్రుకలు సవరించుకొని పైట సర్దుకొని మళ్లీ పనిలోకి వెళ్లేది.

నా కెందుకోగాని మా ఆవిడ తీర్చి జడవేసుకొని పూలుబెట్టుకున్నదానికన్నా, చీరెగట్టి సొమ్ములు పెట్టుకొని, కండ్లకు కాటుక పెట్టుకొని, మత్తుకండ్లతో వాలుచూపులు చూచేదానికన్నా, శృంగార దేవతగా పడకటింట అధివసించేదానికన్నా చెరువు నుంచి నీళ్లు తెస్తుంటుంటే, దిగజారిన చెమటపోసి అలసటలో పనిచేస్తుంటే, రెండు రూములవరకు అన్నం తినక ముఖం వాడిపోయితాంటే, వెంట్రుకలు చెదిరివుంటే నా కెంతో అందంగా, ఆకర్షకంగా, ఇష్టంగా తోస్తుంది. కనుకనే పని చేస్తున్నప్పుడు ఏదో మిషతో వచ్చి చూచి పలుకరించిపోతుంటాను, కాని సాయంకాలం జడ వేసుకొని పూలు బెట్టుకొని అలంకరించుకునేప్పుడు, పని లేకపోయినా బజారుకు పోతుంటాను ఎందుకో ! నాకే అర్థంకాదు.

విధిలేక పొరుగూరు వెళ్లటమే తటస్థిస్తే, రాత్రికి రావటానికి వీలులేకపోతే, నా కారాత్రి గడవటం ఎంతో కష్టంగా వుండేది. దాన్ని ఎప్పుడూ చూడాలనిపిస్తుంది. దాని కండ్లలో కండ్లు, నోటిలో నోరు కలిపి, దేహానికి దేహం పెనవేసి అదో ఆనందాన్ని పొందుదా మనుకుంటా దూరానవుంటే. కాని సమీపించి దాన్ని ప్రత్యక్షంగా చూచే వరకు ఆ ఆనందం, ఆ స్వప్నానుభూతులు కాల సర్పాల్లాగా కరవ్వొస్తాయి ఎందుకో యీ వ్యత్యాసం !

ఇంకో సంగతి. ఆమె దృఢమైన, అందమైన శరీరాన్ని చూస్తే నాకెందుకో భయ మేస్తుంది. ఆ మత్తుచూపులు తూపులై, చివికి జీర్ణించి చిల్లులు పడ్డ హృదయాన్ని మరింతవేధిస్తాయి....స్ప ష్టం గా చెప్పాలంటే ఆమె ఆరోగ్యాన్ని చూచి ఓ విధంగా మనసులో అసూయపడేవాణ్ణి. మానసిక ప్రపంచంలో, ఏ మూలనో దానికి జబ్బు చెయ్యాలని, రోగంతో మూలుగుతుంటే చూడాలని, ఓదార్చాలనీ, డాక్టర్ల చుట్టు మందు సీసా పుచ్చుకొని తిరగాలని, చూచేవాండ్లు యేమి టని అడిగితే, ఇంటిదానికి సుస్తీ చేసిం దని చెప్పా లనే భావం రేకెత్తుతుండేది, వాండ్లు నాస్థితి చూచి ‘ఎప్పుడూ యీ జబ్బులేం దయ్యా, ఓనాడూ శాంతిలేదు నీకు, ఈ మైనా ఆరోగ్యంగా వుండి సుఖపెడుతుం దనుకుంటే ఆదీ లేకపాయ. యేనాటికి యీకష్టం తొలగుతుందో !.... అనవాలె నని, అలా అనిపించుకోవా అనిపించేది—ఎందుకో నాకే తెలియదు,


వచ్చినప్పటినుంచి మా ఆవిడే వంటచార్జీ, పుచ్చుకున్నది. అనుభవం లేనందున, ప సి దై నం దు న మొదట్లోఅన్నం సంకటి చేశో, బియ్యంగానో, నను బాయగానో, కూరలు వుడక్కుండా, ఉప్పు ఎక్కువగానో, కారం జాస్తిగానో వేశేది. ఐనమా నా కా వస్తువులు ఎంతో రుచిగా, శుచిగా వున్న ట్లనిపించేవి. మా ఆవిడచేస్తేనే నాకు అన్నం తినాలనిపిస్తుంది. మా అక్కగారు వండితే ఎట్లాగోవుంటుంది. ఎంత బాగావున్నా నోటికి రుచించేదికాదు. ఆకలి తీరేది కాదు.

ఇక, మా ఆవిడది ఎవ్వరివతో ఎక్కువగా మాట్లాడే స్వభావంకాదు, ఎంతో అవసరం వుంటే, మునిగిపోయేపనివుంటే మా వెధవతో చెప్పమని పంపేది, నే నే ఎదురుగా వుంటే, ఫలానిదిలేదండి’ అనేది శ్రమతో. ‘అప్పుడే ఐపోయిందా !’ అంటే ‘ఆఁ’ అని ఊరుకొనేది. నేను మటుకు ఆమెను మాటిమాటికి పలుకరించాలనుకుంటాను, ఆమె నవ్వుతూ మాట్లాడితే సంతోషించాలనుకుంటా. ఆమె సంతోషానికి నాచేతనైనంత, నాతోచినంత ప్రయత్నించి నెరవేర్చా లనుకుంటా. ఇందుకై ప్రొద్దస్తమానం ఇల్లు కనిపెట్టుకోకుండా, బజారుపనులుకూడా మాని ఇంట్లో పనులుచెయ్యసాగా. ఆమె పనులలో సహాయపడుతున్నా. కాని మా ఆవిడక దెందో, నే నున్నప్పుడు సంతోషంకాని, పనిమీద పొరుగూరికి 4 రోజులు వెళ్లివచ్చేవరకు విచారచిహ్నాలు, వియోగ బాధలు యేవీ కలిగేవిగావు. మరినాకో........!

తప్పని సరిగా పుట్టింటికి పంపవలసివచ్చింది. కొడుకు పెండ్లికి మామగారు పిలవ్వొచ్చారు. పంపటానికి మొదలు ఎన్నో ఇబ్బందులు సూచించా, మక్తాలకు బైటవెళ్లాని, ముసలమ్మ ఒక్కతే ఉండాలని, పిల్లకుంకకు పరీక్షరోజులని, ఆవిడకు కడగా ఉండే రోజులని, మరి నాలుగురోజుల్లో ఇద్దరం కలసి వస్తామని... ఎన్నో అడ్డంకులు చెప్పా. అన్నిటినీ త్రోసిపుచ్చి, పెండ్లి నెలరోజు లున్నా తీసికెళ్లాడు. వెళ్లేటప్పుడు, ‘దిగులు పడవాక,పోంగానే జాబు రాయి, నేను కూడా తొందరలోనే వస్తాలే’ అని చెప్పి, రై లెక్కించి పంపి, ఇంటికివచ్చా. ఇల్లంతా న్నబోయి కరవ్వొస్తున్న ట్లనిపించింది. ఆ రాత్రిస గడవటం కష్ట మనిపించింది. కండ్లలో రాత్రి గడిచిందంటే నమ్మండి. ఐతే ఇది వియోగబాధంటే మీరు నమ్ముతారా?........


వెళ్లిన నాలుగోరోజు జాబువచ్చింది. “సౌ. చి. అమ్మాయి కుశ పాగా వుంది. మేమంతా నీ రాకకై ఎదురుచూస్తున్నాము” అని మామగారు వ్రాశారు. ఆమె నిజంగా ఆనందంగావుందా ! నావలె వియోగ బాధను పొందటంలా ? అన్నం బాగా తింటున్నదా ? భర్త దగ్గరలేదని చింతతో కృశించి పోవటంలా ?..........ఎన్నో రకాల ఆలోచనలు నాకు.

పెండ్లిరేపు కద్దనంగా వెళ్లాను. నాకు పెండ్లిలో వేళకు అన్నం అమరకనో, వంటకాలు ఎక్కువయ్యో, మరి దేనికో జ్వరం అంటుకున్నది. ఏదో మామూలు జ్వరం అనుకోని మొదట అంత లక్ష్యపెట్టలేదు. చల్లగా టైఫాయిడ్ లోకి దిగింది. అందరూహడలిపోయారు. అక్కగారు వినంగానే రెక్కలు కట్టుకొని వాలింది. డాక్టర్లు బారులు తీరారు. బైరాగులు పంక్తి తీర్చారు. దిష్టిమంత్రాలకు, దిగతుడుపులకు ఎడతెరిపి లేదు. బ్రాహ్మణులు గ్రహజపాలు చేస్తున్నారు. ముడుపులు కుప్పలుకట్టాయి. మ్రొక్కులు మిన్నుముట్టాయి. మా అత్తగారు నయమైతే దంపతిసమేతంగా తిరుపతి వచ్చి విలువుదోపిస్తామని దండంపెట్టుకున్నారు. కలియుగ బాంధవుడుకదూ ; ఆమెకలలో కనబడి ‘మీ అల్లుడి కేం ఫరవాలేదు’ అని కూడా చెప్పాడట. ఆయన దయవల్లనేమి, దాని ఐదోతనం గట్టిదైనందువల్లనో, నాకు బత్తెపు నూకలు వుండో, నయమైంది. కొంచం తేరుకున్నా. బలంపట్టింది. వెంటనే మ్రొక్కుతీర్చటానికి తిరుపతికి అందరం బైలుదేరాము. ఇద్దరూ తల నీలాలు ఇవ్వాలన్నారు. ఒక విషాదరేఖ ముఖంలో గోచరించి అదృశ్యమైంది ఆవిడకు. నా మనసు చివుక్కుమన్నది. వళ్లు జలదరించింది........ఇంకెందుకు ; మంగలివానికి తలలు వప్పగించాం. 10 నిమిషాల్లో గుండ్లు చేసివేశాడు. ఒకర్నొకరు చూచుకున్నాం. కాని ఆమెను చూడటానికి నాకే మనస్కరించలేదు; తలవంచుకున్నా. కాని మనసులో ఎక్కడో అజ్ఞాతంగా సంతోషంకూడా లేకపోలేదు. ఏది ఎట్లావున్నా, ఇద్దరిలో 40 సంవత్సరాలభేదం వున్నా ఆకారంలో, అంగాల్లో, బుద్ధుల్లో, కోర్కెల్లో ఎంత భేదం వున్నా తలలలో మటుకు ఏకత్వంగా వున్నాం. సంతోషంలేదూ మరి ....!



‘భారత భాగ్యవిధాత’

(ఈ 11 వ తేదీన నెహ్రూ జన్మదినం.)



ఇండియాలో బర్మా హైకమిషనరుతో నెహ్రూ